

**విడిదింట్లో ఓ మూలగా పరిచిన చాప మీద పడుకుని తన చుట్టూ వున్న మనుషుల్ని ఆసక్తిగా పరిశీలిస్తున్నాడు యశోధర్. ఓ పక్క చతుర్ముఖ పారాయణం జోరుగా సాగుతుంటే మరోపక్క వయసుమీరినవాళ్లు ఓ చోట చేరి తమ అనుభవాలను ఒకరితో ఒకరు పంచుకుంటున్నారు.**

**"ఏమైనా ఆ రోజులే వేరు. పెళ్లనేసరికి పిల్ల సంప్రదాయం చూసే వారుగాని, ఇలా కట్నాలు, కానుకలంటూ పేచీలు ఎరుగం. పెళ్లి యొక్క పవిత్రత డబ్బు చాటున మరుగుపడి నాశనమైంది" ఓ పెద్దాయన వాపోయాడు.**

"అంతేకాదు పూర్వం పెళ్లిళ్లంటే కావలసినంత సందడి. పచ్చని పందిరి, మామిడి తోరణాలతో ఐదు రోజులు వేడుకలు చేసేవారు. ఇప్పుడేముంది. రాత్రికి పెళ్లంటే పొద్దుట షామియానా వేసి, నాలుగు లైట్లు పెట్టి "తూతూ" మంత్రం కానిస్తున్నారు. మర్నాడు చూద్దుంగదా ఆ ఇల్లు పెళ్లయిన ఇల్లులానే వుండదు" మరో ముసలాయన వివరిస్తుంటే నవ్వుకున్నాడు.

"ఈ పెద్దలింతే. వర్తమానాన్ని పాతకాలంతో సమన్వయపరిచి అసంతృప్తి చెందుతారేగాని పరుగెత్తే పరిస్థితుల వేగాన్ని అందుకునే ప్రయత్నం చెయ్యరు" మనసులో అనుకున్నాడు యశోధర్.

ఇంతలో యశోధర్ తండ్రి పార్వతీశం హడావుడిగా కొడుకు దగ్గరకొచ్చి "యశూ! ఈ పెళ్లికి మీ మావగారు వచ్చేరు. వధువు తరుపుననుకుంటా. అతగాడొచ్చి నీతో ఏదన్నా మాటాడతాడేమో కాస్త బింకంగా వుండు. మెత్తగా వ్యవహరిస్తే నిన్నే బుట్టలో పెడతాడు" అన్నాడు.

"అలాగే నాన్నా" అయిష్టంగానే తలూపాడు.

"అలాగే అని తలాడిస్తే కాదు. నువ్వసలే మెతకవాడివి. అలుసిచ్చేక అతడివ్వాల్సిన పాతిక వేలకు నీళ్లొదలాల్సొస్తుంది" మరోసారి హెచ్చరించి వచ్చినంత వేగంగానూ వెళ్లిపోయాడు పార్వతీశం.

తండ్రి వెళ్లేక యశోధర్ సన్నగా నిట్టూర్చి గోడవైపు తిరిగి కళ్లు మూసుకున్నాడు. మనోపథంలో హిమశైల రూపం కదలాడింది. "హిమా" అతని గుండె తియ్యగా మూల్గింది.

మూడు నెలల కిందట పెళ్లిచూపుల్లో హిమను చూడ్డం, ఆమె నచ్చటంతో తన అంగీకారం తెల్పటం, మరో నెలకే తమ పెళ్లి జరిగిపోవటం అంతా నిన్న మొన్న జరిగినట్టు అనూహ్యంగా వుంటుంది. ఆ రోజు తామిద్దరి జీవితంలోను మొదటి రాత్రి. రెండు జీవుల్ని ఏక సూత్రంతో బంధించి తనువులతోపాటు మనసులను కలుపుకొమ్మని ఏకాంతంగా వదిలిన రోజు.

ఆ రాత్రి...

* * *

విశాలమైన ఆ గదిలో ఊపిరాడనట్టుంది యశోధర్‌కు. పైన ఫేన్ తిరుగుతున్నా చెమటతో షర్టంతా తడిసింది. ఏ కాస్త చప్పుడయినా ఉలికిపాటుగా గుమ్మం వైపే చూస్తున్నాడు.

"మొదటి రాత్రి ఆమెతో సున్నితంగా వ్యవహరించాలి" తను లోపలికొచ్చే ముందు అనంత్ మెల్లగా చెప్పిన మాట ఇంకా మనసులో మెదుల్తూనే వుంది.

ఇంతలో కాలి మువ్వల చప్పుడు దగ్గిర్లో లయబద్ధంగా విన్పించింది. అడుగుతీసి అడుగు వేసినప్పుడల్లా విన్పించే ఆ శబ్దం అతడి హృదయం పలికే రాగనాదానికి తాళంలా భాసిస్తోంది.

ఆ చప్పుడు తలుపు దగ్గిరగా వచ్చి ఆగిపోయింది. చూపులు తిప్పి అటు చూశాడు. సరిగా అప్పుడే ఆమె కూడా అతడివైపు చూసి ఆ చూపుల ఎదురుదాడికి తట్టుకోలేక కళ్లు వాల్చేసింది.

ఆమె సోగ కన్నుల్లో శశాంకుడు సవ్వడి చెయ్యకుండా ఉదయించి వెన్నెల రేఖలను పంచుతున్న అనుభూతిని పొందాడు. ఆమెను ఆపాదమస్తకం పరిశీలనగా చూస్తున్నాడు యశోధర్.

## కాఫీ బ్రేక్ స్టోరీ

"ముగ్ధత్వం, లాలిత్యం, సౌకుమార్యం మూడింటిని ముద్దగా చేసి పోతపోసిన పసిడి బొమ్మలా వుంది. ఆ విరించి బహుశా మగాడిని ఆకర్షించి అనురక్తిని పెంచి వ్యామోహమనే పాశంలో ఎప్పుడూ కట్టి వుంచడానికే స్త్రీని ఇంత విశిష్టంగా సృష్టించి వుంటాడు. అలాకాకపోతే లోకంలో సంసారుల కంటే సన్యాసుల శాతమే ఎక్కువుండేదేమో" తన ఊహకు తనే నవ్వుకున్నాడు.

"ఏమిటీ ఆలస్యం? ఆహ్వానం లేదా" అన్నట్టు మరోసారి కళ్లెత్తి చూసింది హిమశైల. అది అర్థం చేసుకున్నట్టుగా "అక్కడే ఆగావేం, ఇలా దగ్గరగా రా హిమా" మృదువుగా అన్నాడు.

ఆమె పెదవులెందుకో ఒక్కసారి ఎర్రదనాన్ని సంతరించుకున్నాయి. అమృతాన్ని పంచబోయే మోహినిలా క్రీగంట చూస్తూ అతడి దగ్గరకొచ్చింది. యశోధర్ ఆమె భుజం మీద చెయ్యి వేసేలోగానే ఆమె వంగి అతడి పాదాలను తాకింది. ఊహించని ఈ సంఘటనకు విచలితుడయ్యాడు. "ఏమ్ సిల్లీ ఏమిటిది?" అంటూ భుజాలుపట్టి లేవదీశాడు. అతడు దగ్గరకు తీసుకోకముందే అతడి హృదయంలో తలదాచుకుంది. ఆ చిరు స్పర్శకే అతడి హృదయం రసవీణ అయ్యింది.

చల్లగా షర్టులోకి ఇంకుతున్న కన్నీరు అతడిని తన్మయావస్థ నుండి తట్టి లేపింది. చివాల్న ఆమె ముఖాన్ని ఎత్తిపట్టి "ఎందుకేడుస్తున్నావు? నేనంటే... ఈ పెళ్లి నీ కిష్టం లేదా?" వివర్ణమైన ముఖంతో అడిగాడు యశోధర్.

"ఉహు! అదేం కాదు"

"మరెందుకీకన్నీరు?" లాలనగా అడిగాడు.

"కృతజ్ఞత. మీ నాన్నగారడిగిన కట్నం పూర్తిగా సమకూరక అసలీ పెళ్లి జరుగుతుందో లేదోనని నాన్నగారు భయపడ్డారు. మీ నాన్నగారు "వీల్లేదన్నా మీరాయనకు నచ్చచెప్పి అదే ముహూర్తానికి మన పెళ్లి జరిగేలా చూశారని తెలిసింది. మీలో మంచితనానికి ... ..." ఆపై ఆమె గొంతు మూగబోయింది.

"అందుకా! అదో పెద్ద త్యాగమనుకుంటున్నావా. అందులో నా స్వార్థం చాలా వుంది. ఈ అందాల బొమ్మతో జీవితాన్ని పంచుకోవాలన్న ఆరాటం నాన్నతో వాదించి ఒప్పించేలా చేసింది" అన్నాడు ఆమెను తనలో పొదువుకుంటూ.




* * *

మొదటి రాత్రి జ్ఞాపకాలు యశోధర్ శరీరాన్ని బరువెక్కించాయి. మళ్లీ పార్వతీశం గబగబ కొడుకు దగ్గరకొచ్చేడు. "యశూ! మీ మావ నీ దగ్గరకే వస్తున్నట్టున్నాడు. చెప్పింది గుర్తుందిగా" హెచ్చరించి కాస్త దూరంగా చతికిలబడ్డాడు.

మరికొద్ది క్షణాల్లో కామేశ్వర్రావు నెమ్మదిగా నడుచుకుంటూ లోపలికొచ్చాడు. అంతమందిలో అల్లుడిని గుర్తుపట్టి.. బావున్నారా బాబూ" అంటూ దగ్గరగా వచ్చాడు.

యశోధర్ జవాబిచ్చేలోగానే "బాగానే వున్నాడు" పార్వతీశం పరుసుగా చెప్పాడు.

ఆయన ముఖం వాడిపోయింది. యశోధర్ మనసు చివుక్కుమంది.

"పెళ్లికూతురు హిమకు బాల్యస్నేహితురాలు. అందుకే అమ్మాయిని కూడా తీసుకొచ్చాను" మామగారు చెప్తున్న మాటలేవీ యశోధర్ చెవికి సోకనే లేదు.

"హిమ తనకు దగ్గరలోనే వుంది. ఒక్కసారి కళ్ల నిండుగా చూడాలి. మనసు విప్పి మాటాడాలి. వీలుచిక్కితే పక్కకు లాక్కెళ్లి కౌగిట్లో బంధించేయాలి" ఊహల వారధి కడుతూ పరవశించిపోయాడు.

అల్లుడి మవునం, వియ్యంకుని కొరకొర చూపుల నడుమ ఆయన అట్టేసేపు నిలబడలేకపోయాడు. చిన్నబోయిన ముఖంతో "వస్తాను బాబూ మీరొచ్చేరని తెలిసి పలుకరించి పోవాలనుకున్నాను" అని చెప్పి వెళ్లిపోతుంటే యశోధర్ ఆయన్ని పిలవబోయి తండ్రి చూపులకు తట్టుకోలేక ఆగిపోయాడు.

పార్వతీశం ముఖంలో 'పీడ వదిలింది' అన్న రిలీఫ్ కన్పించింది. తన మొహమాటానికి లజ్జితుడయ్యాడు యశోధర్. ఈ విషయం హిమకు తెలిస్తే ఆమె చాలా బాధపడుతుంది. ఒక్కసారి హిమనెలాగైనా కలవాలి అని అనుకుని ఓ నిర్ణయానికొచ్చాడు.

"కూతురొచ్చిందని తెలియచెయ్యడానికే వచ్చాడు. నువ్వు నా కొడుకువన్న విషయం ఆతగాడు మర్చిపోయాడు. ఇస్తానన్న కట్నం డబ్బు ఇవ్వకుండా కూతురుచేత ఎలా కాపురం చేయిస్తాడో నేనూ చూస్తాను" మీసం మెలేసి మరీ చెప్తుంటే యశోధర్ నీరుకారిపోయాడు.

"ఈ పంతాలు పట్టింపులతో మా ఇద్దరి మనసుల్లో మమతను నిర్దాక్షిణ్యంగా నలిపేస్తున్నారు. పెళ్లవగానే 'మూఢం, మంచిరోజులు కావని' వాళ్లు హిమను కాపురానికి పంపించలేదు. పెళ్లయిన ఇరవయి రోజులకే ఆషాఢం పెనుభూతంలా వచ్చి ఇద్దర్నీ విడదీసింది. శ్రావణం వచ్చేకయినా తీసుకొద్దామనుకుంటే 'ముందు అనుకున్న రీతిలో కట్నం ఇవ్వలేదు కాబట్టి మిగిలిన బేలెన్సు ఇచ్చాకే రాకపోకలంటూ' తండ్రి తననయినా వెళ్లనీకుండా కట్టడి చేశాడు. పాపం! హిమ తనను గురించి ఏమనుకుంటోంది? తండ్రి మాట జవదాటని పిరికివాడనా!" యశోధర్ ఆలోచనల్తో సతమతమయ్యాడు.

కూర్చున్నవాడల్లా పైకి లేవబోతుంటే "ఎక్కడికి?" అడిగాడు పార్వతీశం.

"ఏం తోచడం లేదు. అలా తిరిగి వద్దామని..."

"మనకు బొత్తిగా తెలియని ఊరాయె. పద నేనూ వస్తాను" అంటూ వెంటబడేసరికి "వద్దులెండి' ' మళ్లీ చాప మీద చతికిలబడ్డాడు.

"కుర్రకుంక" అన్నట్టుగా ఓ చూపు విసిరి మీసాల చాటున నవ్వు దాచుకున్నాడు పార్వతీశం.

యశోధర్ ప్రయత్నాలన్నీ పార్వతీశం తెలివితేటల ముందు వీగిపోయాయి. ప్రధానం తంతు జరిపించేటప్పుడు ఇష్టం లేకున్నా ఆడంగుల వెంట బయల్దేరింది హిమశైలను చూడ్డానికే. కాని అక్కడ ఆవిడగార్ని దర్శన భాగ్యం లభిస్తేగా. తానే పెళ్లి పెద్దయినట్టు అందరికీ కావలసినవి అందిస్తూ లోపలే ఎక్కడో వుండిపోయింది. ఒక్కసారయినా తన కోసం చూడలేదు.

నిజంగా ఈ ఆడాళ్లు చాలా మేధావులు. మగాడిని కట్టెయ్యగల శక్తి వాళ్ల చేతుల్లోది కాదు మనసుల్లోది. చూపుల్తో కవ్విస్తారు. అనురాగంతో బంధిస్తారు. అవసరమొస్తే ఆరడుగుల దూరంలో నిలబెట్టి మరీ వేధిస్తారు. మగాడిలో ఉద్వేగానికి, ఉద్రేకానికి తాము కర్తలం కామన్నట్టు నటిస్తారు.

అతడి ప్రయత్నాలేవీ ఫలించకపోయేసరికి ఉక్రోషం ముంచుకొచ్చింది. "తల నొప్పిగా వుందంటూ..." విడిదింటికెళ్లి చాప మీద వాలాడు.

## ప్రతిభా పాటవం కలిగిన రేష్మ

పరిచయం

అతి పిన్నవయసులోనే గత సంవత్సరం – జిల్లా స్థాయిలో వివిధ సంస్థలు నిర్వహించిన పోటీల్లో 15 బహుమతులు పొందిన రేష్మ బందరు నిర్మలా హైస్కూల్లో 7వ తరగతి చదువుతోంది. బాలల అకాడమీ నిర్వహించిన వక్తృత్వం పోటీలో ప్రథమ బహుమతి – జెసీస్ నిర్వహించిన వ్యాస రచనలో ప్రథమ బహుమతి – బాలల అకాడమీ జిల్లా స్థాయి కూచిపూడి – జానపద నృత్యా లలో ప్రథమ స్థానాన్ని పొందింది. అంతేకాక చిత్రలేఖనము – గ్రీటింగ్ కార్డుల తయారీలో కూడా బహుమతులుపొందింది. పువ్వు పుట్ట గానే పరిమళిస్తుందన్న సామెతకు నిదర్శనం ఈ అమ్మాయి! రేష్మలోని ప్రతిభను గుర్తించి ఆ అమ్మాయి తల్లి శ్రీమతి షాకిరా బేగం తగిన ప్రోత్సాహం ఇస్తున్నారు. శ్రీమతి షాకిరా బేగం స్థానిక పద్మావతీ మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రేష్మ భవిష్యత్తులో ఇంకా ఎన్నో బహు



మతులు పొంది – ఉత్తమ కళాకారిణిగా పేరు ప్రఖ్యాతులు సంపాదిస్తుందని ఆశిద్దాం!

– విన్నకోట సుశీలాదేవి

కాసేపటికి యశోధర్ పిన్ని కూతురు అవంతి లోపలికొచ్చి... "అన్నయ్యా ఈ ప్యాకెట్టు నీ దగ్గరుంచు. పెళ్లితంతయ్యాక తీసుకుంటాను" అంటూ ఓ ప్యాకెట్టు యశూ కిచ్చింది.

అవంతిని చూడగానే మెరుపులాంటి ఆలో చన వచ్చింది. "అవంతీ మీ వదిన ఈ పెళ్లికొచ్చిందన్న సంగతి తెలుసు కదూ?" అడిగాడు.

"తెలుసు. ఆడపిల్ల వారింట్లో హడావి డంతా ఆమెదేగా" నవ్వుతూ అంది.

"బతికించావు. అర్జంటుగా నువ్వు వదిన దగ్గరకెళ్లి నాకు తల నొప్పిగా వుందని ఓ కప్పు వేడి టీ పంపమని చెప్పవూ" బాధను అభినయిస్తూ మరీ చెప్పాడు.

"అలాగేలే" అవంతి వెళ్లగానే "ఈసారెక్క డకు పోతుంది. మొగుడికి తలనొప్పంటే ఏ భార్య మనసు కలతబారకుండా వుంటుంది. హిమ తప్పకుండా వస్తుంది" కళ్లు మూసు కుని చేత్తో టీ కప్పుతో వస్తున్న హిమను ఊహించుకుంటున్నాడు.

పది నిమిషాల్లో నిజంగానే వచ్చింది. హిమ శైల కాదు, అవంతి. "ఇదిగో వదిన టీతోపాటు ఈ టాబ్లెట్ కూడా వేసుకో మంది" అంటూ టాబ్లెట్ కూడా ఇచ్చేసరికి యశోధర్‌కు ఒక్కసారిగా కోపం ముంచు కొచ్చింది. "సరే నువ్వెళ్లు" పొడిగా చెప్పి టీ కప్పు అందుకున్నాడు.

"మరో అరగంట గడిచిందో లేదో "అన్నయ్యా పెదనాన్న రమ్మంటున్నారు" మళ్లీ వచ్చి చెప్పింది అవంతి.

"తల నొప్పిగా వుంది. రాలేనని చెప్పు. అన్నట్టు నాకో హెల్ప్ చేస్తావా అవంతీ" అడిగాడు.

"ఏవిటో చెప్పన్నయ్యా"

"నేనొక చీటీ ఇస్తాను. ఎవరూ చూడకుండా మీ వదినెకు ఇస్తావా? ముఖ్యంగా పెదనాన్నకి విషయం తెలియకూడదు" అన్నాడు.

"అలాగే. ఎవరి కంటా పడకుండా వదినకే ఇస్తాను. సరా."

క్షణాల మీద చిన్న కాగితం సంపాదించి హడావుడిగా నాలుగు వాక్యాలు రాసి అవం తికిచ్చాడు యశోధర్.

"ఏయ్ మొద్దూ! నీ వరస చూస్తుంటే నీకు మొగుడన్న వాడొకడున్నాడన్న విష యమే గుర్తులేనట్టుంది. అది గుర్తుంటే వెంటనే విడిదింటికి ఓసారి రా. వస్తే మన జీవితం మధురస్మృతిలా మిగిలే మార్గాన్ని చూపిస్తాను. ఇప్పుడు రాకపోతే ఈ జన్మలో నీ ముఖం చూడను.

నీ 'యశూ'

అవంతి ఇచ్చిన స్లిప్‌లో మేటరు చదవ గానే హిమశైల గుండెలు దడదడలాడాయి. మామగారి దృష్టిలో పడకుండా పెరటి వైపు నుండి విడిదింటికి నడిచింది హిమశైల.

* * *

జరిగింది తల్చుకుంటే హిమశైలకంతా కలలా వుంది. రెండొందల కిలోమీటర్లు భర్త వెంట రైల్లో ప్రయాణం, స్టేషన్నుండి ఆటోలో తమదైన ఇంటికి రావటం, ఇంటి యజమానురాలు కొత్త కోడలిలా ఆదరించి స్వాగతం చెప్పడం అంతా నమ్మకం కలగనట్టే వుంది.

ఇంటికొస్తూనే లెటర్‌పాడ్ అందుకుని చక చక ఏదో రాస్తున్న భర్తను విస్ఫారిత నేత్రాలతో చూస్తూ నిలబడింది హిమశైల.

యశోధర్ రాయటం ముగించి బొమ్మలా నిలబడ్డ భార్యను "ఏయ్ బుద్దూ! మీ మావ గారికి ఉత్తరం రాశాను. ఓసారి చదువుకో" అంటూ పిలిచి లెటర్ అందించాడు.

పూజ్యులైన నాన్నగార్కి!

మీ మాట కాదని నా భార్యను నా వెంట తీసుకొచ్చేసిన విషయం మేము బయ లేదిన అరగంటకు సునీల్ ద్వారా మీకు తెలిసే వుంటుంది. మీ పట్టుదలలు చూస్తే ఇంతకంటే ఏంచెయ్యాలో నాకు తోచలేదు. మీకు నచ్చచెప్పి ఒప్పించే సాహసం నాకు లేక ఈ మార్గాన్ని ఎన్నుకున్నాను. మీ పంతాలు పట్టింపులతో మా దాంపత్యంలో వుండే సున్నితత్వం, ప్రేమబంధం సడలిపో తుందన్న భయంతో నేనీ సాహసం చేశాను. ఇప్పుడిలా ఒక్కసారి మీ కోడలి కళ్లల్లో మెరిసే కృతజ్ఞత, ఆరాధనా భావం చూశా రంటే నా నిర్ణయం సరైనదనే అంగీకరిస్తారు. ఇంతకన్నా మనసున్న మాగాడిగా, ఆమె కష్టసుఖాలు భరించే భర్తగా ఆమె నుండి కోరుకునే సిరి ఏముంది?

నా మీద కోపం లేదంటే ఒక్కసారి ఇక్క డకు రండి. లేదంటే నా అదృష్టమింతేనని సరిపెట్టుకుంటాను.

మీ కొడుకు

'యశూ'

లెటర్ చదవటం ముగించేసరికి హిమశైల కళ్ల నిండుగా నీళ్లు.

"ఏయ్ ఏమిటిది?" గాభరాగా ఆమె భుజం మీద చెయ్యేశాడు.

జవాబుగా అతడి రెండు చెంపలు పట్టి ముఖాన్ని కిందికి వంచి అతడి పెదవుల్తో తన పెదవులు కలిపింది హిమశైల.